## ఆరుగురితో సలహా మండలి..

విద్యా కమిషన్‌కు కొత్త రూపం

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ఏర్పాటుచేసిన విద్య కమిషన్ కి అనుబంధంగా సలహా మండలి ఏర్పాటు చేసింది. అనుభవం గల ఉన్నత విద్యావంతులతో సలహా మండలి కి ప్రభుత్వం రాజముద్ర వేసింది. ఇప్పటికే ఉద్యో కమిషన్ చైర్మన్ గా ఆకునురి మురళి తో పాటు ముగ్గురు సభ్యులను నియమించిన విషయం తెలిసిందే. అందులో పీఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జోష్ణ రెడ్డికి ఆకాశం కల్పించారు. అయితే కమిషన్ తో పాటు కొత్తగా సలహా మండలని ఏర్పాటు చేయడం గమనార్హ్వం. సలహా మండలిలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ మురళి మనోహర్, వెంకట్ నారాయణ, సూరేపల్లి సుజాత, ఆర్ వెంకట్ రెడ్డి, కేఎం శేషగిరిని సలహా మండలి సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## దంపతుల దారుణ హత్య.. అంబర్ పేట్ లో కలకలం..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** అంబర్ పేట్ డీడీ కాలనీలో జంట హత్యలు కలకలం రేపాయి. కాలనీలో రిటైర్డ్ బ్యాంక్ అధికారి లింగారెడ్డి ఉర్మిలాదేవి దంపతులను గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. దంపతుల హత్య విషయం తెలియడంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. స్థానికులు ఆగ్రహంతో పోలీసులపై చెప్పులు, వాటర్ బాటిల్స్ విసిరేశారు. దీంతో పరిస్థితి కట్టుతప్పుతున్నట్టుగా మారడంతో పోలీసులు తప్పని సరై లాఠీలకు పనిచెప్పారు. కాగా, హత్య విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## పేదల జీవితాలంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తమాషాగా ఉందా..!

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజల ఇండ్లకు మార్కింగ్ చేస్తూ ఇండ్లు కూల్చివేస్తామంటూ రేవంత్ ప్రభుత్వం ప్రకటిస్తున్న నేపథ్యంలో ఇవాళ లంగర్ హౌస్ డివిజన్‌లోని రాందేవ్ గూడ, బాపూనగర్ ప్రాంతాలను సందర్శించి అక్కడి స్థానికులతో మాట్లాడాను.


# జనపదం
J A N A P A D H A M

పగటి వార్తలు 4 PM

హైదరాబాద్ | ఆదివారం 19 అక్టోబర్ 2024 | తెలుగు దినపత్రిక




# అశోక్ నగర్ టు సెక్రటేరియట్..




**జనపదం, బ్యూరో**

గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్ నగర్ అట్టుడుకుతున్నది. రెండు రోజుల నుంచి అభ్యర్థులు నిరసనలు పెరుగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి అభ్యర్థులు రోడ్డెక్కడంతో భారీగా పోలీసులు మోహరించి శాంతిభద్రతల సమస్యలు ఏర్పడకుండా పర్యవేక్షించారు. ఈ క్రమంలోనే భారీ గా అభ్యర్థులు అశోక్ నగర్ కు తరలిరావడంతో పోలీసులు లాఠీచార్జి చేసి కొందరిని అక్కడ నుంచి తరలించారు. కనీసం మహిళా అభ్యర్థులు అని కూడా చూడకుండా స్టేషన్లకు తరలించి 12 గంటల పాటు చిత్ర హింసకు గురిచేశారు. ఇదే విషయమై వారితో మాట్లాడడానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం వారి పరామర్శకు వెళ్లడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

### బాధితులకు బాసటగా..

అశోక్ నగర్ చౌరస్తా వద్దకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేరుకోవడంతో బాధితులు భారీగా తరలివచ్చారు. హాస్టళ్లలో ఉంటూ పగలనక రాత్రనక చదువుకుంటుంటే సర్కార్ చర్యతో కలలన్నీ కల్లలుగా మారుతున్నాయని అభ్యర్థులు ఆవేదన చెందారు. వారికి తోడుగా ఉంటానని, గ్రూప్ 1 బాధితులకు న్యాయం చేయాల్సిందే అని వారితో కలిసి మంత్రి బండ సంజయ్ రోడ్డుపై బైఠాయించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం చేసేంత వరకు కదిలేదని సంజయ్ తేల్చిచెప్పారు.

- నిరుద్యోగుల నిరసన ర్యాలీ..
- బండి సంజయ్ తో కలిసి రోడ్డుపై బైఠాయింపు..
- భారీగా మోహరించిన పోలీసులు..
- కన్నీటి పర్యంతమైన బాధితులు...

### పోలీస్ పహారా..

కాగా, మంత్రి బండి సంజయ్ వస్తున్నారని తెలిసి అశోక్ నగర్ చౌరస్తా సమీపంలోని హాస్టళ్ల వద్ద పోలీసులు అడుగడుగునా పహారా పెంచారు. నిరుద్యోగులు హాస్టళ్ల నుండి బయటకు రాకుండా కట్టడి చేశారు. పోలీసుల నిర్బంధాలను అధిగమించి భారీగా అభ్యర్థులు చౌరస్తాకు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా జనసందోహంగా మారింది. మహిళా అని కూడా చూడకుండా దారుణంగా కొట్టి 12 గంటలపాటు నిర్బంధించారని ఈ సందర్భంగా పలువురు మహిళా అభ్యర్థులు వాపోవడం కంటతడి పెట్టించింది.

### చలో సెక్రటేరియట్..

వేలాది మంది నిరుద్యోగులతో కలిసి బండి సంజయ్ 'ఛలో సెక్రటేరియట్' కు బయలుదేరారు. వందలాది మంది అభ్యర్థులతో కలిసి సంజయ్ సెక్రటేరియట్ కు వెళ్తుండడంతో పోలీసులు పహారా పెంచారు. మొత్తానికి పోలీసుల పహారా నడుమ యాత్ర ఇంకా కొనసాగుతూనే ఉంది.





# లాఠీల, లూటీల రాజ్యం

- రిజర్వేషన్ విధానంపై పట్టింపు లేదా..?
- నిరుద్యోగులపై ఎందుకంత చిన్నచూపు..
- మాజీ మంత్రి హరీష్ రావు
- విద్యార్థులపై లాఠీ చార్జిపై తీవ్ర ఆగ్రహం..

**జనపదం, సిద్దిపేట బ్యూరో**

రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగితే, ఇక్కడ రేవంత్ రెడ్డి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నడని, ఆయన రాజ్యాంగాన్ని భగవద్గీతగా అభివర్ణిస్తే సీఎం మాత్రం దానిని ఆచరించడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి తెచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, మెరిట్ సాధించిన స్టూడెంట్స్ కి ఓపెన్ కోటాలో కాకుండా, రిజ్వర్వుడు కోటాలో అవకాశం కల్పించడం దారుణం అన్నారు. ఆ విధానంతో రిజ్వరేషన్ విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని, ఓపెన్ కోటా ఓపెన్ టు ఆల్ అనే విషయాన్ని మర్చిపోయి తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ దళిత, గిరిజనులు, మైనార్టీలు, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని హరీష్ రావు దుయ్యబట్టారు. అసెంబ్లీలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తే భట్టి విక్రమార్క పరిశీలిస్తామని మాటిచ్చారని, కానీ చేయడం లేదని కేవలం ఆయన ఆ వర్గానికి ప్రతినిధిగా ఉండి మౌనంగా ఉంటున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాలని, ఆయా వర్గాల ప్రజలకు న్యాయం జరగడానికి తోడ్పాటు అందించాలన్నారు. ఓపెన్ కోటాలో రిజర్వుడు వారికి ప్రవేశం లేకుండా చేయడం అన్యాయం అన్నారు. ఈ విషయమై అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల ఆర్తనాదాలతో అశోక్ నగర్ ప్రాంతం మార్మోగుతోందని, రిజర్వేషన్లు అమలు చేయాలని రోడ్డెక్కితే వీపులు పగుల కొట్టించడం న్యాయమేనా అని నిలదీశారు. నిరుద్యోగులపై అమానుషంగా ప్రవర్తించిన ప్రభుత్వ చర్యను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేద పిల్లలు జిల్లాల నుంచి వచ్చి ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని 5 రూపాయలు అన్నం తింటూ చదువుకుంటున్నారని, అలాంటి వారిపై అక్రమ కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, వారన్నట్టుగా ఇంకో నెల పది రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు నింపాలని డిమాండ్ చేశారు.

### సెక్యూరిటీ లేకుండా రా..

అశోక్ నగర్ కు సెక్యూరిటీ లేకుండా వెళ్లే దమ్ముందా రేవంత్ రెడ్డి ఉందా చెప్పాలన్నారు. కేసులు పెట్టినా, విద్యార్థుల మీద లాఠీలు లేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, అణిచివేతలతో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. పదవి రాకముందు ఏదేదో మాట్లాడిన కోదండరాం, రియాజ్, చింతపండు నవీన్, ఆకునూరి మురళీ ఇప్పుడెక్కడున్నారని, ఏమీ మాట్లాడడం లేదని నిలదీశారు. వాళ్లు ఇప్పటికైనా అశోక్ నగర్ వెళ్లి విద్యార్థులతో మాట్లాడాలన్నారు.

# ఆక్రమణ దారులకే భయం..

- ప్రజలు నిశ్చింతగా ఉన్నారు..
- సవాల్ విసిరిన వారి జాడెక్కడ..
- సీఎం రేవంత్ రెడ్డి
- హరీష్ రావు, కేటీఆర్, ఈటలపై ఫైర్



**జనపదం, చార్మినార్**

అక్రమార్కుల కంటికి కునుకు లేకుండా చేస్తానని, తాను ఇప్పుడు మూసీ దగ్గరకే వచ్చానని, సవాలు విసిరిన వారు ఎక్కడపోయారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చార్మినార్ ఏరియాలో సందర్శన అనంతరం మాట్లాడారు. హైడ్రా అనగానే ఈటల, హరీష్ రావు, కేటీఆర్ బయటకు వచ్చారని, పేదలెవరు దానికి భయపడడం లేదని చురకలంటించారు.

### ప్రక్షాళనపై క్లారిటీ..

హైడ్రా, మూసీ ప్రక్షాళనపై సీఎం రేవంత్ ఈ సందర్భంగా మరోమారు క్లారిటీ ఇచ్చారు. చెరువులు, నాలలు ఆక్రమించుకున్న వాళ్లే భయపడుతున్నారని, అనుమతులు ఉన్నవాళ్లు హైడ్రా కు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు అడిగినప్పుడు అనుపతి పత్రాలు చూపిస్తే చాలని, రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక నుంచి ఆర్థిక ఉగ్రవాదుల భరతం పడతామని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎవరు భయపడొద్దన్నారు. పెద్దలను కట్టడి చేసి పేదలకు పంచుతామని, నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు.

### కేటీఆర్ ఫాం హౌజ్ చూద్దాం రండి..

బుల్డోజర్ ఖాళీగా ఉంచామని, ఎవరు అడ్డం వచ్చి పడుకుంటారో రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ ఫాం హౌజ్ అక్రమంగా కట్టుకోలేదా అందరం కలిసి వెళ్లి చూద్దామన్నారు. అలాగే అజీజ్ నగర్ లో హరీష్ ఫాం హౌజ్ లేదా చెప్పాలన్నారు. ఫాం హౌజ్ లో అడ్డం పడుకున్న ఆయన రావాలని, ఫాం హౌజ్ మీదికి బుల్డోజర్ వస్తుందని కేటీఆర్, హరీష్ భయపడుతున్నారన్నారు.

# గత పాలకుల పుణ్యమే మూసీ కంపు..

- ఎస్టీపీతో శుద్ధీకరణకు బీఆర్ఎస్ అడుగులు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..



**జనపదం, హైదరాబాద్ సిటీ**

మూసీ మురికి కూపంగా మారటానికి గత పాలకులే కారణమన్న రేవంత్ మాటలతో తాను ఏకీభవిస్తానని, కాంగ్రెస్, టీడీపీలు ఉన్నప్పుడే మూసీ మురికి కూపంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాగోల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఎస్టీపీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ఎస్టీపీలు నిర్మించటం కారణంగా మురుగు నీరు శుద్ధి నీరుగా మారుతుందన్నారు. నాగోల్‌లో నిర్మించిన ఎస్టీపీ దేశంలోనే అతిపెద్ద మురుగు నీటి శుద్ధి కేంద్రం అన్నారు. 2015 లో సెంట్రల్ పొల్యుష్యన్ బోర్డు మూసీ అతి కాలుష్యమైన నది అని రిపోర్ట్ ఇచ్చిందని, అంటే అప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీలే మూసీని పాడు చేశాయన్నారు. గతంలో కాంగ్రెస్ నల్గొండకు మురికి నీళ్లను పంపిస్తే మేము మంచి నీళ్లను పంపిస్తున్నామన్నారు. తాము కట్టించిన ఇళ్లకు సున్నం వేసి గుంపు మేస్త్రి తానే కట్టిన అని చెప్పుకుంటున్నాడన్నారు. ఇప్పుడు ఆయన అదృష్టం బాగుందని, అందుకే ఆయన టైం నడుస్తోందన్నారు.

### ప్రజాధనం లూటీ..

మూసీ పేరుతో ప్రజాధనం లూటీ చేసే కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని, రూ. లక్షా 50 వేల కోట్లు అంటున్నాడన్నారు. సుధీర్ రెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడే దాదాపుగా పనులు చేశామన్నారు. అన్ని లెక్కల ప్రకారం చూసినా రూ.25 వేల కోట్లతో ప్రాజెక్ట్ పూర్తి అవుతుందని, ఐతే మూసీ ప్రాజెక్ట్ కు ఎంతో ఖర్చు చేస్తారో వాళ్లకే తెలియటం లేదని దుయ్యబట్టారు. ఇదే రేవంత్ రెడ్డి ఏప్రిల్‌లో రూ. 50 వేల కోట్లు అన్నాడు. జీహెచ్ఎంసీ వాళ్లు రూ. 60 వేల కోట్లు అన్నారు. జూపల్లి కృష్ణారావు రూ. 70 వేల కోట్లు అన్నాడు, ఆ తర్వాత ఇదే ముఖ్యమంత్రి మళ్లీ రూ. లక్షా 50 వేల కోట్లు అంటాడని దుయ్యబట్టారు. ఏదిఏమైనా కాంగ్రెస్ పార్టీకి దేశంలో పరిస్థితి మంచిగా లేదు. వాళ్లకు పైసలు తెలంగాణ నుంచే కావాలె. అందుకే రేవంత్ రెడ్డి పైసలు కోసం చేస్తున్నాడన్నారు.